


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 28-02-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 146 పేజీలు : 8 వెల : 1 రూపాయి







## సౌత్‌కోస్ట్ రైల్వేగా విశాఖ జోన్

- సౌత్ కోస్ట్ రైల్వేగా విశాఖ జోన్‌గా నామకరణం
- విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లతో జోన్ ఏర్పాటు
- రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్



విశాఖ సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్నాళ్లగానో ఎదురుచూస్తున్న కల నెరవేరింది. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌కు కేంద్రం ఎట్టకేలకు అంగీకారం తెలిపింది. విశాఖ కేంద్రంగా కొత్త రైల్వే జోన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు బుధవారం (ఫిబ్రవరి 27) సాయంత్రం రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటన చేశారు. కొత్త రైల్వే జోన్‌కు సౌత్ కోస్ట్ రైల్వేగా నామకరణం చేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లతో ఈ జోన్ ఏర్పాటువుతుంది. మిగిలిన కార్యక్రమాలను త్వరలోనే పూర్తి చేస్తామని గోయల్ వెల్లడించారు. జోన్ ఏర్పాటు దిశగా త్వరలోనే అధికారిక చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైల్వేజోన్ ఏర్పాటు పై భాగస్వాములందరితోనూ చర్చించామని,

తరువాయి 2లో..

### సరిహద్దులో ఉన్న భద్రతా దళాలు

# అప్రమత్తంగా ఉండాలి

సైనిక అధికారులను ఆదేశించిన ప్రధాని మోదీ

భద్రతపై ప్రధాని మోదీ అత్యవసర భేటీ



దిల్లీ : భద్రతా పరమైన అంశాలపై చర్చించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన మోదీ తన ప్రసంగాన్ని మధ్యలోనే నిలిపివేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. భారత్ భూభాగంలోకి పాక్ యుద్ధ విమానాలు చొచ్చుకొని వచ్చినట్లు వార్తలు రావడంతో వెంటనే దీనిపై చర్చించేందుకు ఆయన అత్యవసర భేటీ ఏర్పాటు

తరువాయి 2లో..

## మిగ్ 21 బైసన్ కోల్పోయాం

భారత వింగ్ కమాండర్‌పై పాక్‌లో దాడి..!

భారత విదేశాంగశాఖ ప్రతినిధి రవీష్ కుమార్

శ్రీనగర్: భారత్‌కు చెందిన వింగ్ కమాండర్ అభినందన్‌పై పాక్ ఆక్రమిత కశ్మీర్లో దాడి జరిగింది. మిగ్ -21 బైసన్ విమానం కూలిపోయే సమయంలో ఆయన సురక్షితంగా బయటపడ్డారు. కానీ పాక్ అక్రమిత కశ్మీర్‌లోని ఓ నదీ పరీవాహక ప్రాంతంలో ఆయన నేలపైకి దిగినట్లు తెలుస్తోంది. అప్పటికే విమానం కూలిపోవడం గమనించిన సైనికులు, కొందరు స్థానికులు అక్కడకు చేరుకున్నారు. అప్పటి వరకు

తరువాయి 2లో..



విశాఖ రైల్వే జోన్ ప్రకటనతో విశాఖ రైల్వే స్టేషన్ వద్దకు చేరుకుని మిఠాయిలు పంచుకుని ఆనందోత్సాహాలలో పాల్గొన్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్, రాష్ట్ర నాయకురాలు పురంధేశ్వరి, నగర అధ్యక్షుడు నాగేంద్ర మరియు భాజపా అభిమానులు, కార్యకర్తలు

## తాడేపల్లి నుంచి వైసీపీ రాజకీయాలు

వైకాపా కేంద్ర కార్యాలయం ప్రారంభం .. వైసీపీలో చేరిన దగ్గుబాటి హితేష్



తాడేపల్లి : నవ్యాంధ్ర రాజధానిలో రాజకీయ కార్యకలాపాలు ప్రారంభించారు వైసీపీ అధినేత జగన్. తాడేపల్లిలో నూతన గృహప్రవేశం చేసిన జగన్.. పక్కనే పార్టీ కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. అనంతరం ఈ నూతన కార్యాలయం నుంచి చేరికల కార్యక్రమానికి వైసీపీ అధినేత శ్రీకారం చుట్టారు. బుధవారం మధ్యాహ్నం జగన్ సమక్షంలో పలువురు నేతలు వైసీపీలో చేరారు.

ముందు మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు తనయుడు హితేష్ చెంచురామ్ వైసీపీ కండువా కప్పుకున్నారు. జగన్ హితేష్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటూ పలువురు ముఖ్య అనుచరులు కూడా పార్టీలో చేరారు. అనంతరం చీరాల ఎమ్మెల్యే ఆమంచి ఆమంచి కృష్ణమోహన్ కూడా అధికారికంగా వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు.

వైసీపీలో చేరడం ఆనందంగా ఉందన్నారు హితేష్, ఆమంచి. పార్టీని బలోపేతం చేయడంతో పాటూ వచ్చే ఎన్నికల్లో జగన్ను ముఖ్యమంత్రిని చేసేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు.




## వైకాపా కృషి ఫలితమే ప్రత్యేక రైల్వే జోన్



విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ రావడం శభపరిణామం. వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై ఎస్ జగన్మోహనరెడ్డి కృషి ఫలితంగానే ఇది సాధ్యపడింది. దశాబ్దాల కల నెరవేరడం సంతోషంగా ఉంది. విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ సాధించడంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి పాత్ర చాలా కీలకం. రైల్వే జోన్ సాధనకై ఆనాడు పార్టీ ఎం.పిలు రాజీనామాలు చెయ్యడం, అసమ్మతిని అసెంబ్లీలో ప్రవేశపెట్టడం, ఆమరణ నిరాహార దీక్షలు చెయ్యడం, ఢిల్లీ వేదికగా అధిష్టానం పైఒత్తిడి తేవడం నేటి ఈ కలసాకారానికి పునాది రాళ్లుగా చెప్పుకోవచ్చు. ఇదే పంథాలో జగన్ నాయకత్వంలో దూసుకువెళ్తూ ఆంధ్రప్రదేశ్ కి ప్రత్యేక హోదా ఖచ్చితంగా తెచ్చి తీరుతాం.

**- ఎంవివి సత్యనారాయణ**

వైఎస్ఆర్ సీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయ కర్త



# పోరుబాటలో జర్నలిస్టులు



విజయనగరం : జర్నలిస్టులకు త్రిబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మిస్తామని నమ్మించి చివరకు మొండిచేయిచూపిస్తున్న ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం కలక్టర్ కార్యాలయంలో ఎదురుగా జర్నలిస్టులు రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. యూనియన్లకు అతీతంగా బాధితులంతా ఒకటై పోరుబాట పట్టారు. మొదట్నించి ఈ విషయమై ప్రభుత్వ అనేక అనుమానాలకు తావు ఇస్తూ చివరికి నీరుకార్చే విధంగా మారిందని పలువురు విమర్శించారు. కేవలం లాబియింగ్ ప్రయత్నాలు సరి అయినవి కావని స్పష్టం చేసింది. రాబోవు ఎన్నికల్లో తెలుగుదేశానికి చుక్కలు చూపెట్టడానికి కూడా సిద్ధమైంది. ఎన్నికల ప్రక్రియ కంటే ముందే ఈ సమస్యను ఒక కొలిక్కి తేవాలని నిరాహారదీక్ష ద్వారా అనేక జిల్లాల్లో పాత్రికేయులు నిరసన తెలుపుతున్నారు. ఒకవైపు మహారాష్ట్ర పాత్రికేయులకు ఫ్రీలాన్స్ జర్నలిస్టులకు కూడా పింఛను పతకాలను ప్రవేశ పెడుతుంటే మన ప్రభుత్వం ఇళ్ళులేని జర్నలిస్టులకు కనీసం స్థలం, లేదా ఇళ్ళు నిర్మించలేని పరిస్థితిలో ఉందని పలువురు పాత్రికేయులు విమర్శిస్తున్నారు. అలాగే విజయనగరంలో ఉన్న అక్రిడేటెడ్ జర్నలిస్టుల్లో చాలామంది సీనియర్లు కూడా ఉన్నారు. కనీసం ఇక్కడ జర్నలిస్టులు లేరనే భావనలో సమాచార శాఖ పనిచేయడం శచనీయమని అన్నారు. ఈ రోజు జర్నలిస్టులు ఐక్యతతో తమ బలాన్ని రుజువు చేస్తూ ప్రభుత్వానికి కళ్ళు తెరిపించాలని నిర్ణయించి అంతా ఒకే వేదికపై వచ్చి నిరాహారదీక్ష శిబిరంలో పాల్గొన్నారు. ఇందులో ఏపియుడబ్లుజె నాయకులు శివప్రసాద్, మహాపాత్రో, మరో జర్నలిస్ట్ సంఘం నాయకులు ఆదినారాయణ, చిన్న పత్రికల సంఘం నాయకులు పాల్గొన్నారు. దీక్షను లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నేత భీశెట్టి బాబ్జీ, జిల్లా సేవాదళ్ నాయకులు మారం బాల బ్రహ్మారెడ్డి, నగర రైతువిభాగం అధ్యక్షులు రెడ్డి గురుమూర్తి , వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.వి.వి. రాజేష్, మహిళా విభాగం నేత కోలగట్ల శ్రావణి సంఘీభావం ప్రకటించారు.

## నియోజకవర్గానికి 10 సామాజిక భవనాలు

రోలుగుంట : చోడవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు పది సామాజిక భవనాలకు ఎమ్మెల్యే రాజు మంజూరు చేశారని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు గుములూరు చంద్రమౌళి, గండి సింహాద్రి, పిట్ల బుల్లిబాబులు తెలిపారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖ నిధుల నుంచి వీటిని కేటాయించారని వివరించారు. ఒక్కొక్క భవనానికి రూ.10లక్షల చొప్పన నిధులను మంజూరు చేశారని చెప్పారు. వీటిలో రోలుగుంట మండలానికి గానూ బుచ్చెంపేట, కె.నాయుడిపాలెం, రత్నంపేట, కుసర్లపూడి, రావికమతం మండలం కొత్తకోట, టి.అర్జాపురం, మేడివాడ, బుచ్చెయ్యపేట మండలం వడ్డాది, పెదమదినా, సీతయ్యపేట గ్రామాలకు మంజూరు చేశారని వివరించారు. ఆయా గ్రామాల్లో వీటి నిర్మాణ పనులకు త్వరలోనే శ్రీకారం చుడతామన్నారు. సామాజిక భవనాలను మంజూరు చేసినందుకు మంత్రి నక్కా ఆనందబాబు, ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటర్ పరీక్షలు ప్రారంభం

నర్సీపట్నం : ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. నర్సీపట్నంలోని ప్రభుత్వ బాలికల, బాలుర కళాశాలలు, బాలయోగి బాలికల గురుకుల కళాశాల, వివేకానంద, డాన్‌బాస్కో కళాశాల, వేములపూడి మోడల్ కళాశాల, కేడిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారు. సుమారు 3వేల మంది పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంచారు.

## ఒకే కాన్పులో ముగ్గురు ఆడపిల్లలు జననం



విజయనగరం: జిల్లాలోని మక్కువ మండలం దుగ్గేరు సమీపాన మూలవలస గ్రామంలో సోడిపిండి సింగమ్మకు బుధవారం జరిగిన కాన్పులో ముగ్గురు మగ పిల్లలకు జన్మనిచ్చింది. బాలింత ఆరోగ్యం...పిల్లల ఆరోగ్యం బాగుందని ఈ మేరకు వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికే ఈమెకు ఇద్దరు మగపిల్లలున్నారు. మొత్తం ఐదుగురు పిల్లలను కంటికి రెప్పలా చూసుకుంటానని ఆమె ఆనందం వ్యక్తం చేసింది.

## ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ కార్పొరేషన్ల రుణాల సబ్సిడి సొమ్ము విడుదల చేయాలి

నర్సీపట్నం : ప్రభుత్వం వివిధ కార్పొరేషన్‌లో ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీ కార్పొరేషన్‌ల్లో 2018-2019 సంవత్సరంకు సంబంధించిన సబ్సిడి సొమ్ము బ్యాంకులకు విడుదల చేయాలని రెల్లి హక్కుల పోరాట సమితి విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు డిమాండ్ చేశారు. మంగళవారం నర్సీపట్నం శాంతినగర్‌లో ఎస్సీ, ఎస్టీ, బిసి ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ సబ్సిడి సొమ్ము బ్యాంకులకు విడుదల చేయకపోవడం వలన లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. లబ్ధిదారులు ఎన్నికల కోడ్ కారణంగా ఈ రుణాలు మంజూరు అవుతాయా లేదా అని లబ్ధిదారుడు లబోదిబోమంటున్నారు. కావున ఆయా శాఖ కార్పొరేషన్ మంత్రులు దృష్టిసారించి తక్షణమే రుణాలు మంజూరుకు సహకరించాలని కోరారు. సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిటీ నాయకులు దొండా చిన అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు కోట్లాది రూపాయలు నిధులు కేటాయింపులో అధికారుల నిర్లక్ష్యం తగదన్నారు. ఈ సమావేశంలో మారుడుపూడి సురేష్,ఇల్లపు బెన్నేసులు, చిరంజీవి పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్ల ఆత్మీయ సమావేశం



విజయనగరం : రాష్ట్ర విభజన సమయంలో 616 హామీలను ఇచ్చిన తెలుగుదేశం పార్టీ వాటిని అమలుచేయడంలో విఫలమైందని సీనియర్ సిటిజన్లు వాపోయారు. ఈ మేరకు స్థానిక వైయస్సాఆర్ పార్టీ ఉత్తరాంధ్ర కన్వీనర్ కోలగట్ల వీరబధ్రస్వామి గృహంలో బుధవారం సమావేశమైయ్యారు. విశ్రాంతి ఉద్యోగుల సమస్యలను కూడా పరిష్కరించలేదని వాపోయారు. ప్రత్యేక హెూదా అంశంపై ఒక్క జగన్ మాత్రమే అసంబ్లీలో గొంతువిన్నించారని, ఇప్పటికీ అదే డిమాండ్‌తో ఉన్నారని అన్నారు. ఈ మేరకు మార్చి 2వ తేదీన స్థానిక రింగ్ రోడ్ వద్ద సినియర్ సిటిజన్సు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.పి.ఈశ్వర్, పింఛనుదార్ల సంఘ జిల్లా అధ్యక్షులు పెద్దింటి అప్పారావు తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, , మాజీ మంత్రి , వైయస్సాఆర్ పార్టీ రాష్ట్ర నాయకులు బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి పి.సాంబశివరాజు, పార్టీ ఉత్తరాంధ్ర కన్వీనర్ కోలగట్ల వీరబధ్రస్వామి విచ్చేస్తారని తెలిపారు. ఈ మేరకు కరపత్రాలు, పోస్టర్లు విడుదల చేశారు.

## అయ్యా...ఎన్.టి.అర్ గృహాలు మంజూరు చెయ్యరా!



అరకులోయ : నియోజక వర్గ హుకుంపేట సరసపాడు పెదబయలు దుమ్మంది మారు మూల గిరిజన గ్రామాల్లో నేటికి దేశానికి స్వాతంత్ర్యం వచి 72 ఏళ్ళవుతున్న ఎన్.టి.అర్ గృహాలు మంజూరు కాక మట్టితోనె స్వతహగా ఇల్లులు నిర్మించుకుంటున్నారు.గ్రామస్తులు అంటున్నారు ఎన్.టి.అర్ గృహాలు మంజూరవ్వాలంటే డబ్బు ధనం రాజకీయబలం ఉన్నవాడికి మంజూరు చేస్తున్నారు మేము చూస్తే పూటకి తిండిలేని గతిలేని గరీబ్ గిరిజనులం మేం ఎక్కడి డబ్బులిచ్చి గృహం మంజూరు చేయ్యించుకోగలం అని బాధతో వా పోతున్నారు. ఇక మా బ్రతుకులు మారేదెప్పుడు?మా బ్రతుకులు మారాలంటే ఆ దేవుడే దిగి రావాలి అంటున్నారు.

ఆది కాలం నుండి నేటి వరకు మా గ్రామాలు ఏ దేవుడు దిగివచ్చి అభివృధి చేస్తాడో అని గ్రామ మాజి సర్పంచ్ కిల్లో.సుబ్బారావు తో పాటు గ్రామస్తులు ఎదురు చూస్తున్నాం అని అంటున్నారు.

## అప్పన్న నరసింహ యాగానికి ఎల్‌జి పోలీమర్స్ విరాళం



సింహాచలం : శ్రీ వరాహలక్ష్మీనారసింహస్వామి వారి దేవస్థానం వారు ఈ నెల 11 నుండి 20 వరకు నిర్వహించనున్న నారసింహయాగానికి ఎల్‌జి పాలిమెర్స్ కంపెనీ వారు యాగము నిమిత్తం సుమారు లక్షా ఏబైవేలరూపాయలును బుధ వారం దేవస్థానం కార్యలయంలో ఏఈఓ కృష్ణ మాచార్యులు, రాఘవ కుమార్లకు ఈ చెక్ ను కంపెనీ అదికారులు దక్షిణామూర్తి ఇతర సిబ్బంది కలిసి అందజేశారు.

## బకులూరు ఘటనపై విచారణ వాయిదా

కొయ్యూరు : బకులూరు ఘటనపై మంగళవారం నిర్వహించాల్సిన విచారణ వాయిదా పడింది. కొన్ని శాఖల అధికారులు హాజరు కాకపోవడంతో జిసిసి డిఎం పార్వతమ్మ ఈ విచారణ వాయిదా వేశారు. జన్మభూమి గ్రామసభలో వీఆర్వో మడపల శ్రీనివాసరావు, గ్రామస్థుడు పెయ్యల రమేష్ మధ్య వివాదం చోటుచేసుకుంది. అది తోపురాటకు దారి తీసింది. దీనిపై పాడేరు సబ్ కలెక్టర్ వెంకటేశ్వర్ విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా చింతపల్లి జిసిసి డిఎం, మండల ప్రత్యేకాధికారి కురసా పార్వతమ్మను నియమించారు. ఆమె అందరికీ నోటీసులు జారీ చేశారు. విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. అయినా మంగళవారం విచారణకు పలువురు అధికారులు హాజరు కాలేదు. దీంతో విచారణ వాయిదా వేశారు.

మొదటి పేజీ తరువాయి

## సరిహద్దులో ఉన్న భద్రతా దళాలు అప్రమత్తంగా ఉండాలి

చేశారు. నేషనల్ యూత్ ఫెస్టివల్ 2019 కార్యక్రమానికి హాజరైన మోదీ విద్యార్థులతో మాట్లాడుతుండగా పీఎంవో కార్యాలయానికి చెందిన ఓ అధికారి చిన్న పేపర్‌ను తీసుకొచ్చి ఆయనకు ఇచ్చారు. దీంతో వెంటనే మోదీ తన ప్రసంగాన్ని మధ్యలోనే ఆపేసి వెంటనే వేదిక దిగి అక్కడ నుంచి వెళ్లిపోయారు.

మోదీతో పాటు కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా సరిహద్దు భద్రతపై సమీక్షించారు. నార్త్ బ్లాక్‌లో రాజ్‌నాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి జాతీయ భద్రతా సలహాదారుడు అజిత్ డోభాల్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. భారత్-పాక్ సరిహద్దులో ఉన్న భద్రతా దళాలు చాలా అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనకు జరగకుండా చూసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. భారత్‌కు చెందిన రెండు యుద్ధ విమానాలను కూల్చివేశామని, ఒక పైలెట్‌ను అదుపులోకి తీసుకున్నామని పాక్ చెబుతోంది.

### మిగ్ 21 బైసన్ కోల్పోయాం

ఆయన ఒంటిమీద ఎలాంటి గాయాలూ లేవు. కానీ కొద్దిసేపటికే ఒక సైనిక స్థావరంలో ఆయన చేతులు వెనక్కి కట్టేసి తీసిన వీడియోలో మాత్రం ఆయన కంటి వద్ద గాయాలు ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. దీంతో ఆయనపై దాడి జరిగినట్లు స్పష్టమవుతోంది. ఆయనను స్థానికులు పట్టుకున్నప్పుడు కొందరు వ్యక్తులు దాడి చేస్తున్న వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

పాకిస్థాన్‌లో భారత్‌కు చెందిన మిగ్ 21 బైసన్ యుద్ధవిమానం కూలినట్లు భారత విదేశాంగశాఖ ప్రతినిధి రవీష్ కుమార్ ధ్రువీకరించారు. పైలట్ ఒకరు గల్లంతయ్యారని వివరించారు. అతడు తమ అదుపులో ఉన్నట్లు పాక్ చెబుతోందన్నారు. ఈ మేరకు మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. భారత్ చేపట్టిన వాయుసేన దాడికి ప్రతిగా భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ బుధవారం దాడికి పాల్పడిందని వివరించారు. పాక్ దాడులను సమర్థంగా తిప్పికొట్టామని తెలిపారు. పాక్‌కు చెందిన ఎఫ్-16 విమానాన్ని కూల్చివేశామని, ఈ క్రమంలో మిగ్ 21 బైసన్ విమానం కూలిపోయిందని, కమాండర్ గల్లంతయ్యాడని తెలిపారు. అతడు పాక్ అధీనంలో ఉన్నట్లు ఆ దేశం చెబుతోందని, వాస్తవాలను తెలుసుకుంటున్నట్లు చెప్పారు.

బుధవారం ఉదయం పాక్ విమానాలు భారత భూభాగంలోకి చొచ్చుకొచ్చాయి. వాటిని అడ్డుకొనే క్రమంలో శ్రీనగర్‌లో ఉన్న క్విక్ రియాక్షన్ టీమ్‌లోని మిగ్‌లు రంగంలోకి దిగాయి. ఈ క్రమంలో భారత్‌కు చెందిన మిగ్ 21 బైసన్ పాక్ భూభాగంలోకి ప్రవేశించింది. ఆ విమానంలో ఉదయం వెళ్లిన పైలట్ అభినందన్ ఇప్పటి వరకు తిరిగి రాలేదు. ఇప్పటికే అభినందన్ తమకు చిక్కినట్లు పాకిస్థాన్ ఒక వీడియో కూడా విడుదల చేసింది.

### సౌత్‌కోస్ట్ రైల్వేగా విశాఖ జోన్

జోన్‌పై విస్తృతంగా అధ్యయనం చేశామని చెప్పారు. ప్రస్తుత వాల్తేర్ డివిజన్‌ను రెండు భాగాలుగా విభజిస్తా మన్నారు. ఒక భాగాన్ని విజయవాడ డివిజన్‌లో కలిపి జోన్‌లో ఉంచుతామని, మరో భాగాన్ని రాయగడ డివిజన్‌గా మారుస్తున్నామని తెలిపారు. రాయగడ డివిజన్ ఈస్ట్‌కోస్ట్ జోన్‌లో భాగంగా ఉంటుందని గోయల్ వివరించారు. విభజన చట్టం ప్రకారం కొత్త రైల్వేజోన్ ప్రకటించామన్నారు.

వాల్తేరు డివిజన్ ప్రస్తుతం ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ పరిధిలో ఉంది. విశాఖ కేంద్రంగా కొత్త జోన్ ఏర్పాటు చేయాలని ఏళ్లుగా ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. విభజన హామీల్లో ఏపీకి ప్రత్యేక హోదాతోపాటు విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు అంశం కూడా ఉంది. అయితే, నాలుగున్నరేళ్లుగా ఈ అంశాన్ని కేంద్రం నాన్చుతూ వస్తోంది. తాజాగా రైల్వేజోన్ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రధాని నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా ఈ ప్రకటన ఉంటుందన్న వార్తలు ఇటీవల ఊపందుకున్నాయి. ఈలోగానే కేంద్రం కొత్త రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ ప్రకటన చేయడం గమనార్హం.

## రౌడీయిజానికి, దౌర్జన్యానికి కాలం చెల్లింది

### జనసేన వస్తోంది



కడప: కడప జిల్లాలో కొందరు నేతల రౌడీయిజానికి, దౌర్జన్యానికి కాలం చెల్లిందని, వారి కోటలు బద్దలు కొట్టడానికి జనసేన వస్తోందని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. వేల కోట్ల రూపాయలు సంపాదించి ప్రజలను బానిసలుగా చూస్తున్న నాయకులకు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. కర్నూలు జిల్లా పర్యటన ముగించుకుని కడప జిల్లాలో అడుగుపెట్టిన పవన్ బుధవారం రాత్రి కడప అన్నమయ్య కూడలిలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు.

ప్రతిపక్ష నేత జగన్ చట్టసభలకు వెళ్లకుండా ప్రజలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీ పాత్రను జనసేన పోషిస్తోందని గుర్తు చేశారు. రౌడీమూకలు, ప్రైవేటు సైన్యంతో భయపెట్టాలని చూస్తే ఇక్కడ ఎవరూ భయపడే వారు లేరన్నారు.

తాను ముఖ్యమంత్రి కావాలనుకుంటే నిలువరించే దమ్ము ఎవరికైనా ఉందా? అని ఆవేశంగా ప్రశ్నించారు. రాయలసీమను రతనాల సీమగా మార్చడానికి, ప్రజల్లో మార్పు తీసుకురావడానికి, సీమకు స్వేచ్ఛ ఇవ్వడానికే తాను రాజకీయాల్లోకి వచ్చానని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.

## ఏపీ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది

### ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి .. బీజేపీ సీనియన్ నేత పురంధేశ్వరి



విశాఖపట్నం: సాంకేతిక అవరోధాలను అధిగమించి రైల్వే జోన్ ఇచ్చామని బీజేపీ సీనియన్ నేత పురంధేశ్వరి అన్నారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్‌ను కేంద్రం ప్రకటించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిపక్షాలు అనవసరంగా బీజేపీపై దుమ్మెత్తిపోశాయి. ఏపీ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని నిరూపించాం అని అన్నారు.

కాగా బుధవారం సాయంత్రం కేంద్రమంత్రి పీయూష్ గోయల్.. విశాఖకు రైల్వే జోన్ ప్రకటించి... మీడియా ద్వారా అధికారికంగా స్పష్టం చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వే జోన్, కడపకు ఉక్కు ఫ్యాక్టరీ ఇస్తామని ఎన్నికల ముందు ప్రధాని మోదీ తిరుపతి పర్యటనలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ మూడు ఇవ్వలేమని కేంద్రం స్పష్టం చేసింది. మార్చి 1న ప్రధాని మోదీ విశాఖలో పర్యటించనున్నారు. ఆయన పర్యటనకు రెండురోజుల ముందు కేంద్రం విశాఖకు రైల్వే జోన్ ప్రకటించడం గమనార్హం.

## ప్రత్యేక హోదా కూడా ఇస్తారని ఆశిస్తున్నా

విశాఖపట్నం: విశాఖకు రైల్వే జోన్ ప్రకటించడంపై వైసీపీ నేత అవంతి శ్రీనివాస్ స్పందించారు. బుధవారం జీవితంలో మర్చిపోలేని రోజని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది విశాఖ ప్రజల విజయమని ఆనందం వ్యక్తం చేశారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుతో పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని తెలిపారు. ప్రత్యేక హోదా కూడా వస్తుందని అవంతి శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా 4 దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ఏపీకి కేంద్రం తీపి కబురు చెప్పింది. విశాఖకు రైల్వే జోన్ ప్రకటించింది. బుధవారం సాయంత్రం కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ఈ మేరకు మీడియా ద్వారా అధికారిక ప్రకటన చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వే జోన్, కడపకు ఉక్కు ఫ్యాక్టరీ ఇస్తామని ఎన్నికల ముందు ప్రధానమంత్రి నరేంద్రమోదీ తిరుపతి పర్యటనలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ మూడు ఇవ్వలేమన్నాకు

# విజయభాను

## సంపాదకీయం

# పాక్‌పై లక్షిత దాడి

పుల్వామా ఉగ్రవాద దాడి తర్వాత మంగళవారం వేకువ జామున పాక్ భూభాగంలోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడి జాతి ఆగ్రహానికి సంకేతంగా చెప్పవచ్చు. మిరాజ్ జెట్ యుద్ధ విమానాలతో నియంత్రణ రేఖకు మూడు నాలుగు కిలోమీటర్ల దూరంలోని బాలాకోట్ ప్రాంతంలోని ఉగ్రవాదుల శిక్షణ స్థావరాలపై భారత్ బాంబు దాడులు చేసింది. ఇందులో జైష్ ఏ ముహ్మ ద్ ఉగ్రవాద సంస్థకు చెందిన టాప్ కమాండర్లు, శిక్షకులతో పాటు 325మంది దాకా ఉగ్రవాదులు హతమైనట్లు దాడిలో పాల్గొన్న మిలిటరీవర్గాలు చెబుతున్నాయి. జైష్ ఏ ముహ్మద్ ఉగ్రవాద సంస్థ స్థాపకుడైన మసూద్ అజార్‌కు దగ్గరి బంధువు మౌలానా యూసఫ్ అజర్ నిర్వహిస్తున్న బాలాకోట్ శిబిరం నేలమట్టం అయ్యిందని, దీంతో మరో ఆత్మాహుతి దాడి ప్రమాదం తప్పిందని భారత సైనిక నిఘా వర్గాలు చెబుతున్నాయి. కాగా పాకిస్థాన్ కథనం ఇందుకు భిన్నం గా ఉన్నది. భారత్ విమానాలు నియంత్రణ రేఖ దాటి చొరబడ్డాయని, తాము ప్రతిచర్యకు దిగే లోపల, జనావాసంలేని ఓ కొండ ప్రాంతంలో పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలను జారవిడిచారని పాక్ అంటున్నది. ఈ ఘటనలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరుగలేదని చెబుతున్నది. ఫిబ్రవరి 14న పుల్వామా ఉగ్రవాద దాడిలో 43మంది భారత జవాన్లు ప్రాణాలు కోల్పోయిన తర్వాత దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమైంది. 2011నాటి ముంబాయి ముట్టడి, పఠాన్‌కోట్ వైమానిక స్థావరంపై దాడి, యురీ ఘటన, మళ్లీ ఇప్పుడు పుల్వామా దాకా ఉగ్రవాద దాడులు సాగుతూనే ఉన్నాయి. పుల్వామా ఘటన తర్వాత ఉగ్రవాదుల ఆట కట్టించటానికి పాకిస్థాన్‌పై పరిమిత యుద్ధం చేయక తప్పదనే అభిప్రాయం బలపడ్డది. ఈ నేపథ్యంలోనే మోదీ ప్రభుత్వం లక్షిత దాడికి దిగిందని స్పష్టమవుతున్నది. ఆధునిక శాస్త్ర సాంకేతికతతో జరిగిన యుద్ధావిష్కరణలు ప్రపంచగతిని మార్చేశాయి. అన్నింటికీ పాత పద్ధతిలో సైనిక చర్యలతోనే పరిష్కారం దొరుకుతుందనే ఆలోచనలకు కాలం చెల్లింది. కండబలం కన్నా బుద్ధిబలం నిర్ణయాత్మకమైనదని అనేక సందర్భాలు రుజు వు చేశాయి. ప్రపంచంలోనే తిరుగులేనిశక్తిగా చెప్పుకుంటున్న అమెరికా వియత్నాం యుద్ధంలో గెలువలేకపోయింది. అపారసైనిక శక్తి కలిగిన సోవియట్ రష్యా ఆఫ్ఘనిస్థాన్‌లో తోకముడువాల్సి వచ్చింది. ఇప్పటికీ అఫ్ఘనిస్థాన్, ఇరాక్, సిరియాల్లో అమెరికా, దాని అనుంగు దేశా ల దుస్థితి చూస్తున్నదే. గత యుద్ధాల్లో గెలిచామనే అహంతో సైనికబలంతోనే నేటి ఆధునిక యుగంలో యుద్ధంలో గెలుస్తామని ఆలోచించటం దుస్సాహసం. ఇప్పుడు పాక్, భారత్ ఇరుదేశాలూ అణుశక్తిని కలిగి ఉన్నాయి. నిన్న మొన్నటి దాకా పాక్‌తో అంటకాగిన అమెరికా, 26/11 వరల్డ్ ట్రేడ్ టవర్స్‌పై అల్‌ఖైదా దాడి తర్వాత వెనక్కి తగ్గినా, చైనా తెరమీదికి వచ్చింది. 2012-16 మధ్య కాలంలో పాక్ ఆయుధ దిగుమతుల్లో 68శాతం చైనా నుంచే ఉన్నాయంటే పరిస్థితి ఊహించుకోవచ్చు. నేటి ప్రపంచీకరణ యుగంలో ఏ ఒక్క దేశం ఒంటరి కాదు. భౌగోళిక, రాజకీయార్థిక సమీకరణల నేపథ్యంలో బాహాబాహి పోరాటం అనేది ఉండదు. ప్రాంతీయ యుద్ధాలనేవి పాతకాలం పద్ధతి. ఇప్పుడు యుద్ధమంటూ జరిగితే ప్రపంచయుద్ధంగా,అణు యుద్ధంగా పరిణమించే ప్రమాదం ఎక్కువ. ఈ పరిస్థితుల్లో పంతానికి పోయి పాతకాలపు ఆలోచనలతో సైనిక చర్యలే పరిష్కారంగా ఆలోచించటం, అడుగులు వేయటం అనుసరణీయం కాదు. అందువల్ల పాకిస్థాన్‌ను కట్టడి చేస్తూనే, యుద్ధం విషయంలో ఆచితూచి వ్యవహరించాలనే సూచనలు వినబడుతున్నాయి. ఇదే నీతి చైనా, పాకిస్థాన్ దేశాలకూ వర్తిస్తుంది. 70 ఏండ్లుగా రావణకాష్టంగా రగులుతున్న కశ్మీర్ సమస్య కారణంగా భారత్ ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీ ఇన్నీ కావు. నాటి నుంచి నేటి దాకా పాక్ సరిహద్దు వెంట చొరబాటుదారుల సమస్య, కశ్మీర్‌లో వేర్పాటువాద సమస్య వెరసి పాక్‌తో మూడు యుద్ధాలు చేయాల్సి వచ్చింది. 1965నాటి భారత్-పాక్ యుద్ధం, 1971నాటి బంగ్లాదేశ్ అవతరణ యుద్ధం, ఇటీవలి కార్గిల్ యుద్ధం దాకా భారత్ పైచేయి సాధించి యుద్ధంలో గెలిచింది. ఈ యుద్ధాల్లో సైనిక విజయం కన్నా నైతిక విజయమే గొప్పది. ఈ అన్ని సందర్భాల్లో భారత్ సకారణమైన విధానాలతో ప్రపంచదేశాల మద్దతు సాధించటంలోనే అసలు విజయం దాగి ఉన్నది. ఇప్పుడు కూడా సాధారణ ప్రజల్లో నెలకొన్న పాక్ వ్యతిరేకత ప్రాతిపదికగా సైనిక చర్య మాత్రమే పరిష్కారంగా భావించటం వాంఛనీయం కాదు. ఉగ్రదాడులకు, కశ్మీర్‌లో వేర్పాటువాద సమస్యకు రాజకీయ పరిష్కారాలు ఆలోచించకుండా సైనిక చర్యలతోనే సమస్య పరిష్కారం అవుతుందని అనుకోకూడదు. దేశీయంగా కశ్మీరీయుల కోపతాపాలు చల్లార్చేందుకు నిబద్ధతతో ప్రయత్నించాలి.

## ది బెస్ట్... వైజాగ్ వెస్ట్ పుస్తకావిష్కరణ చేస్తున్న మజ్జి సోమేశ్



ములగాడ: పశ్చిమ నియోజక వర్గం గత నాలుగున్నర సంవత్స రాల నుండి అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ ప్రజల గుండెల్లో గుర్తుండిపోయే నాయకుడు ఎమ్మెల్యే గణబాబు ఆయన చేస్తున్న అభివృద్ధి పుస్తక రూపంలో ది బెస్ట్ వైజాగ్ వెస్ట్ ప్రజల మధ్యకు తీసుకొని వెళ్లా లని ఉద్దేశంతో 49 వార్డు నగ రాల సంఘం వద్ద తెలుగు దేశం పార్టీ వార్డు అధ్యక్షులు మజ్జి సోమేశ్ చేతుల మీదగా పుస్తక ఆవిష్కరణ చేశారు అనం తరం ఆయన మాట్లాడుతూ ఈ రోజు మన ప్రాంతంలో ఎనలేని అభివృద్ధి చేసి పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తూ అన్ని కార్యక్రమాలు ఒక పుస్తక రూపంలో ప్రజల మధ్యకు తీసుకుని వెళ్లడం అది నా చేతుల మీద ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు 49 వార్డ్ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి నీలపు జోగి బాబు కామరాజు పైడి రాజు సంఘం పెద్దలు బోగవిల్లి అప్పారావు మరూపిల్లి నూకరాజు తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి





ములగాడ: మల్కాపురం ప్రధాన రహదారి మీద బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మల్కాపురం శెట్టి బలిజ వీధిలో నివాస ముంటున్న ఒల్ల పెంటయ్య (70) నావల్ పార్క్ లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు యధా విధిగా ఈరోజు ఉదయం విధులకు వెళ్లే సమయంలో మల్కా పురం ప్రధాన రహదారి నుండి రోడ్డు దాటుతున్న సమయంలో శ్రీహరిపురం నుంచి అతివేగంగా వస్తున్న నేవీ ఉద్యోగి ఎం ఎస్ నాయక్ వాహనంతో పెంటయ్య ను ఢీకొనడంతో తలకు బలమైన గాయం అవడంతో పెంట య్య అక్కడికక్కడే మృతిచెందాడు నేవీ ఉద్యోగి కి స్వల్ప గాయాలు అయినవి సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేయడంతో కొంతసేపు ఆందోళన చేపట్టారు నేవీ ఉద్యోగ సమాచారం మేరకు నేవీ అధికారులు చేరుకొని కుటుంబ సభ్యులకు తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు అనంతరం మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ తరలించారు.

# చంద్రశేఖర్ సీతారాం తివారి పోరాటం



యలమంచిలి : ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, హిందూ స్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీ వ్యవస్థాపకుడైన చంద్రశేఖర్ సీతారం తివారి వర్ధంతి కార్యక్రమాన్ని మర్రి బంద మండల పరిషత్ ప్రాథ మిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ప్రధానో పాధ్యాయుడు కూరపాటి వినోద్‌కుమార్ మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభు త్వాన్ని పారద్రోలేందుకు తిరుగుబాటే మార్గమని భావించిన చంద్రశేఖర్ ఆజాద్ తన సహచరులైన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్, పండితారాం ప్రసాద్, బిస్మిల్, రాకూర్ రోషన్‌సింగ్, ప్రేమ్ కిషన్ ఖాన్‌తో కలిసి అనేక పోరాటలు చేసినాడని అన్నారు. బ్రిటిష్ వారిపై ఆజాద్ పోరాడిన తీరు భారతదేశ విప్లవ చరిత్రకే వన్నె తెచ్చిందన్నారు. 15 ఎళ్లు కూడా నిండని అతి పిన్నవయస్సులో దేశ స్వాతంత్ర్యం కోసం గాంధి చేస్తున్న పోరాటాలకు ముగ్ధుడైన ఆజాద పలు ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్ని బ్రిటీష్ వాళ్ళగుండెలో నిలిచిన మహా వీరుడన్నారు. శత్రువుకు తన ప్రాణాలను ఇవ్వకూడదని భావించిన ఈయన ఎంతో ధైర్యసాహసాలతో బ్రిటిష్ సైన్యం తనను బంధించేందుకు చుట్టుముట్టినప్పుడు తనకు తానుగానే కాల్చుకొని 24 ఎళ్ళకే ప్రాణం ఫణంగా పెట్టాడన్నారు.

అలాంటి మహణీయుని అడుగుజాడల్లో నేటి యువతరం నడిచి, దేశం కోసం శత్రుమూకలపై విరుచుకు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో నూకరత్నం, మంగ, మోరాభిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆంధ్రా హక్కులను తొక్కేస్తే సహించం

విశాఖపట్నం : వివిధ కారణాలు చూపించి ఆంధ్రా హక్కులను తొక్కేయాలని చూస్తే సహించేది లేదని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చి 1వతేదీన మోడీ రాకను నిరసిస్తూ ఏపీ హక్కుల సాధనకై వివిధ ఉద్యోగగ సంఘాల ఆధ్వర్యంలో జివియంసి గాంధీ విగ్రహం వద్ద నిరాహారదీక్ష చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలో అంశాలు, ఆంధ్రాకు రావలసిన నిధులు సమకూర్చాలన్నారు.

## 6వ వార్డులో ఇంటింటికి తెలుగుదేశం

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీలోని 6వ వార్డులోని గవరవీధిలో నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. అయ్యన్న యువసేన అధ్యక్షులు చింతకాయల విజయ్‌క మహిళలు, యువకులు బ్రహ్మరథం పట్టారు. వార్డులో చేసిన అభివృద్ధిని కరపత్రాలపై ప్రచురించి ప్రజలకు అందచేస్తూ ఆడపడుచులకు గొడుగులను బహుకరించారు. గవరవీధిలో ఉన్న చిన్నపాటి సమస్యలను విజయ్‌కు వివరించారు. వార్డులో మొత్తం రూ.8కోట్ల 44లక్షల 10వేలతో అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆడారి రమణమ్మ, మళ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమయం (కవి సమయం)

### కిటికీలు తెరుద్దాం!

కాలం కేలండర్లో ఓ పేజీ చిరిగిపోయింది
కాలపుష్పంలోంచి ఓ దళం రాలిపోయింది.
కాల భ్రమణంలో... ఓ అడుగు కలిసిపోయింది... కనుమరుగైపోయింది.
కాలం ఉరుకుతోంది...
ఉరకలు వేస్తోంది!
ఉత్సాహం ఊయలలూగుతోంది...
ఉర్రూతలూగుతోంది!!
కొత్త గాలులు వీస్తున్నాయ్!
కొంగొత్త ఆశలు పూస్తున్నాయ్!!
మమతల పూవులు మదిమదిన విరుస్తున్నాయ్.
అమృతం జల్లులు హృది హృదిన కురుస్తున్నాయ్!
తూరుపు గట్టున వెలుతురు పిట్టలు
అణువణువునా.. వెలుగుల గుట్టలు.
చిమ్మ చీకట్లను తరుముతోంది ఉషోదయం!
ప్రతి ముంగిట నిలుస్తోంది శుభోదయం!!
కొత్త గాలులు వీస్తున్నాయ్...
కొంగొత్త ఆశలు పూస్తున్నాయ్!!
కిటికీలు తెరుద్దాం!
పరదాలు పరుద్దాం!!

...కవితా రచన
'బహుముఖ ప్రజ్ఞా ప్రపూర్ణ
రమాప్రసాద్ ఆదిభట్ల

# పంచాంగం

మాసం : పుష్య; తిథి : నవమి ఉ.10.25; మూల రా.తె.5.59; ప.వ.1.18ల 2.58; తె.వ.4.18ల 5.59. | గురువారం 28-02 -2019

**మేషం** : బంధువులను కలుసుకుంటారు. రావలసిన ధనం వసూలు విషయంలో శ్రమాధిక్యత, ప్రయాసలెదుర్కొంటారు. నూతన పరిచయాలు, వాతావరణం సంతృప్తి నిస్తాయి. **వృషభం** : బ్యాంకుల్లో మీ పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కో వలసి వస్తుంది. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు కలిసివస్తాయి. ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలు, ఒప్పందాల్లో మెలకువ వహించండి. **మిథునం** :స్త్రీలకు, గృహ వాతావరణం, సంతానం వైఖరి వల్ల చికాకులు తప్పవు. కళాకారులకు, క్రీడాకారులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. పలుకుబడి కలిగిన వ్యక్తుల పరిచయం వల్ల పనులు అనుకూలిస్తాయి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణం మంచిది కాదు. **కర్కాటకం** :విదేశీ వస్తువుల పట్ల ఆకర్షితులవుతారు. ప్రముఖులను కలుసు కుంటారు. బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. మీ సంతానం ఉన్నతి కోసం కొత్తకొత్త పథకాలు రూపొందిస్తారు. స్త్రీలలో ఒత్తిడి, హడావుడి అధికమవుతాయి. **సింహం** : పోస్టల్, కొరియర్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికమవుతుంది. నిరుద్యోగులకు సదావకాశాలు లభించిన సద్వినియోగం చేసుకోలేరు. ఉపాధ్యాయులకు పై అధికారుల నుంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. మీ కళత్ర మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. **కన్య** : కొంతమంది మీతో సన్నిహితంగా ఉంటూనే చాటుగా అపకారం తలపెట్టేందుకు యత్నిస్తారు. చిన్ననాటి మిత్రులను, ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. స్థిరాస్తిని కొనుగోలుచేయు యత్నాలు ఫలిస్తాయి. పనులు మొదట్లో మందగించినా క్రమేపీ పూర్తికాగలవు. కుటుంబీకులతో దైవ దర్శనాలు చేసుకోగలగుతారు. **తుల** : కాంట్రాక్టర్లకు కార్మికులతో సఖ్యత నెలకొంటుంది. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. భాగస్వామి మాటతీరు, కదలికలను గమనించడం ఎంతైనా మంచిది. **వృశ్చికం** : ఆర్థిక లావాదేవీలు, ఒప్పందాల్లో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. వృత్తిపరంగా ఎదుర్కొంటున్న ఆటంకాలు క్రమంగా తొలగిపోగలవు.

## 12వవార్డు వైస్సార్ పార్టీ కార్యాలయం ప్రారంభం



విశాఖపట్నం : బుధవారం ఉదయం విశాఖ ఉత్తర నియోజకవర్గం 12 వ వార్డు అధ్యక్షుడు ముత్యం సూర్యారావు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం ప్రారంభం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయ కర్త కె.కె.రాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నవాబ్,బాబ్ జాన్, బాపిరాజు, గౌన్య,కళ్యాణ్,యు.రాము,మణికంఠ,అప్పారావు,భాష,వై.శ్రీనివాన్,కిరణ్ రాజు,కె.పి.రత్నాకర్,కె.చిన్నా,బి.గోవింద్ రాజు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వై.సి.పి. నాయకుల సమావేశం



భీమునిపట్నంః స్థానిక వై.సి.పి. కార్యాలయంలో బుదవారం పార్టీ నాయుకులు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమా వేశంలో వై.సి.పి. నాయుకులు ఎస్ కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ నిన్న టిడిపి నాయుకులు అవంతీ పై చేసిన ఆరోపనలను వై.కా.పా. నాయుకులు ఖండిచారు. ఎప్పుడు ఆరోపణలు చేసినా బిల్లమెట్ట గురించే తప్ప ఇంకేమీ ఉండవా అని ప్రశ్నించారు.బిల్లమెట్ట స్థలములు ఇచ్చినప్పుడు వాటిలో తెలుగుదేశం పార్టీ నాయుకులకు కూడా ఇచ్చారని. అదే బిళ్ళల మెట్ట స్థలం పై కమిటీ వేసిన తరువాత అందులోనే లో మీ నాయుకులు అమ్మడం లేదా అని ఎద్దేవ చేసారు. ఎన్నికల ల్లో ఇచ్చిన హామీలు చిట్టివలస జ్యూట్ మిల్ సమస్య, తగరపువలస ఆర్.టి.సి.కాంప్లెక్స్, చిల్ల పేట పెద్ద చెరువు సమస్యలను పరిష్కారం చేయలేదని, అలాగే విద్యాశాఖ మంత్రి గా వుంటూ తగరపువలస కు మహిళా కళాశాల ఆనందపురం లో జూనియర్ కళాశాల నిర్మించకుండా ఎన్నికల ముందు హడావిడిగా శంకుస్థాపన చేయడమేమిటి అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమం లో మాజీ కౌన్సిలర్ లు కదిరి ఎల్లాజీ, జగ్గుపల్లి ప్రసాద్,జీ. వి.రమణ, సర్పచ్ ఎస్.శ్రీను, నాయుకులు గుండాసు మదునాయుడు, తదితరులు పాల్గొన్నారు

# వాయుసేనకు 'వాసుపల్లి' అభినందనలు



విశాఖపట్నం : పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ జైషే మహ్మమద్ శిక్షణ స్థావరాలను మట్టుబెట్టిన 12 మిరాజ్ 2000 వాయు సైనికులకు విశాఖలో వినూత్నంగా అభినందనలు తెలిపారు. గతంలో భారత వాయుసేన లో పనిచేసి పదవీ విరమణ చేసిన విశాఖపట్నం దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ నేతృత్వంలో విశాఖపట్నం గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జివిఎంసి) కార్యాలయం ఎదురుగా గల గాంధీ విగ్రహం వద్ద జరిగిన జయహో భారత్‌లో ఆయన అభినందనలు తెలిపారు. 12 మంది పైలట్ల ఫొటోలతో కూడిన హోర్డింగ్‌లను మైదానంలో ఏర్పాటు చేసి వాటికి పూలమాల వేసి జయ హో భారత్ నినాదాలు చేశారు. వీరి అభినందనల విధానం చూసిన నగర వాసులు సైతం జయ హో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైన సైన్యం కల్గిన దేశాల్లో భారత్ నాల్గవ స్థానం లో ఉందని, దేశ భక్తి లో నెంబర్ 1 స్థానంలో ఉన్నామన్నారు. తానూ వాయుసేనలో విధులు నిర్వహించేనాటికి నేటికీ సాంకేతిక విజ్ఞానం అసాధారణంగా పెరిగిందన్నారు. అందరికీ భారీ సెల్యూట్ చేస్తున్నట్టు తెలిపారు. తానూ ఒక్కడే సైన్యంలో పనిచెయ్యడం కాకుండా, వందలాది మంది యువకులను సైన్యంలోకి పంపేందుకు వైజాగ్ డిఫెన్స్ అకాడమీ పేరుతో సైనిక స్కూళ్లలో ప్రవేశానికి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చా రామిరెడ్డి, అల్లూరి సత్యనారాయణ రెడ్డి, లక్ష్మీ శివప్రసాద్, కోటేశ్వర రెడ్డి, గంట్యాడ శంకరరావు, సింహాచలం, విల్లూరి చక్రవర్తి దంపతులు తదితర తెలుగుదేశం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్

# మొదటి సంవత్సరం పరీక్షలు



భీమునిపట్నం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, గొల్లలపాలెం ఎ.ఎం.జీ కళాశాల, దొరతోట నవజీవన్ కళాశాల,తగరపువలస లో వున్న బాసర, శ్రీకృష్ణ కళాశాల, మూలకుద్దు కేథరిన్ కళాశాలలో బుదవారం నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా మొదలు అయ్యాయి పరీక్ష కేంద్రాలకు విద్యార్థిని విద్యా ర్థులు ఉదయం ఎనిమిది గంటలకే పరీక్ష కేంద్రాలకు వచ్చారు.

వారిని ఎనిమిదిన్నరకి పరీక్ష హల్ లోపలి కి పంపారు. ఈ పరీక్షల్లో అక్రమాలు జరగకుండా ఉండేందుకు విద్యార్థులకు జంబ్లింగ్ పద్ధతిలో పరిక్షలు నిర్వహిస్తున్నామని పరీక్షల చీఫ్ సూపేరెండేంట్ ఎస్ జయసుదాకర్, ప్రశ్నాపత్రాల సంరక్షణాదికారి డి.దుర్గా ప్రసాద్ తెలిపారు.

ఈ పరీక్షలు ప్రతీ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని అన్నారు. మొదటి రోజు తెలుగు, సంస్కృత పరీక్షలు జరిగాయి.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

# 3న నర్సీపట్నంలో ఓపెన్ షటిల్ టోర్నమెంట్

నర్సీపట్నం : ఉత్తరాంధ్ర ఆర్‌సిఎం ఓపెన్ షటిల్ టోర్నమెంట్‌ను మార్చి 3న నిర్వహిస్తున్నట్లు షటిల్ క్లబ్ ప్రతినిధి రాజేష్ తెలిపారు. దీనిని పెదబడ్డేపల్లి ఆర్‌సిఎం స్కూల్ నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. ప్రథమ బహుమతి రూ.8వేలు, ద్వితీయ బహుమతి రూ.6000, తృతీయ బహుమతి రూ.4000, నాల్గో బహుమతి రూ.2వేలు అందజేస్తామని ఆయన వివరించారు.

# పోరాటంతోనే సమస్యలు పరిష్కారం




అరకులోయ : అరకులోయ పర్యాటక శాఖ పున్నమి గోష్టిలో జరిగిన సమావేశంలో నియోజక వర్గ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్న సమావేశంలోసి.ఐ.టి.యు రాష్ట్ర నాయకులు ఏ.వి నాగేశ్వరరావు మాట్లాడుతు రాష్ట్రంలో చిన్న చిట్కా ఉద్యోగులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తుంది, అలాగే ప్రతి కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు భవిషత్ లో జరిగే విషయాలకు ముందుకు ఉండి పోరాటం చేస్తేనే తప్ప మన బ్రతుకులు మారవు అన్నారు.ఈ సమావేశంలో నాయకులు ఉమామహేశ్వరరావు పర్యాటక శాఖ నుండి వి.బాబురావు కె.వనది దొర మత్స్యరాజు మహిళా ఉద్యోగులు ఆరోగ్యశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

# రామన్నపాలెం వసతి గృహ విద్యార్థులకు జ్వరాలు

నాతవరం : నాతవరం మండలం రామన్నపాలెం బాలుర వసతి గృహ విద్యార్థులకు జ్వరాలు వ్యాపించడంతో వారంతా బుధవారం నాతవరం పిహెచ్‌సికి వచ్చారు.

13 మందికి విద్యార్థులు ఆసుపత్రికి రాగా వైద్యాధికారి ప్రసన్న వారికి వైద్య పరీక్షలు చేసి వైరల్ జ్వరాలుగా గుర్తించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రసన్న మాట్లాడుతూ మారుతున్న కాలాను గుణంగా ఈ వైరల్ జ్వరాలు వ్యాపిస్తా యన్నారు. విద్యార్థులు పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



నాతవరం పిహెచ్‌సికి వచ్చిన రామన్నపాలెం వసతి గృహ విద్యార్థులు

# పరిసరాల పరిశుభ్రత ముఖ్య బాధ్యతగా భావించాలి

## జిల్లా కలెక్టర్ హరిజవహర్‌లాల్



విజయనగరం : వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ఎంత ముఖ్యమో, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం కూడా అంతే ముఖ్యంగా ప్రతీ ఒక్కరూ భావించాలని జిల్లా కలెక్టర్ హరిజవహర్‌లాల్ అన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం పురపాలక సంఘం, పిటిసి సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక రింగ్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో చెత్తా, చెదారం, ప్లాస్టిక్ కవర్లు, పిచ్చిమొక్కలు తొలగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ హరిజవహర్‌లాల్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందన్నారు. పలు వ్యాధులకు మూలకారణం అపరిశుభ్ర వాతావరణమని, స్వచ్ఛభారత్ కార్యక్రమంలో దీనిని నియంత్రించాలని కోరారు. పరిసరాల పరిశుభ్రత బాధ్యత ప్రతీ ఒక్కరిదన్నారు. పరిసరాల పరిశుభ్రత కేవలం మున్సిపల్ సిబ్బంది బాధ్యతగా భావించ వద్దన్నారు. కాలనీ అసోసియేషన్లు స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో వారి పరిసరాలను శుభ్రపరుచు కోవాలని సూచించారు. పరిస రాల పరిశుభ్రత ప్రజలందరి భాగ స్వామ్యం తోనే సాధ్యమవు తుందన్నారు. చెత్తా, చెదారాలను కాలువల్లో, రోడ్లపై వేయకుండా, తడి, పొడి చెత్తలను వేరుచేసి పురపాలక వాహనాలను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.ఎస్. వర్మ, పిటిసి ప్రిన్సిపాల్ మెహర్‌బాబు, పురపాలక, పిటిసి సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మోడీపాలనపై మండల టీడీపీ శ్రేణులు నిరసన



పరవాడ: మండల కేంద్రమైన పరవాడ సంతబయలు గల ఎన్టీఆర్ విగ్రహము వద్ద జిల్లాప్రాదేశికసభ్యులు పైల జగన్నాదరావు, ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు అధ్యక్షతన మోడీపాలనపై మండలతెలుగుదేశముపార్టినాయకులు నిరసన తెలియజేసారు. అనంతరము అతిథిలు మాట్లడుతూ ఎన్నికల్లో ఇచ్చినహామీలు అమలు చేయడములో మోడీ ప్రభుత్వము వెనుకంజులో వుందని అన్నారు. మోడీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో

ఇ.బోనంగి మాజీసర్పంచ్లు బొద్దపు నూకరత్నం, అట్టా సన్యాశి అప్పారావు, ఇ.బోనంగిఉప సర్పంచ్ బుగిడి గోవింద, మండలటిడిపి ప్రదాన కార్యదర్శి పైల రామచంద్రరావు, జన్మ భూమి కమిటి మెంబర్ రెడ్డిశ్రీనువాసురావు, జిల్లా తెలుగు యువత అర్గనైజింగ్ కార్యదర్శి వియ్యపు చిన్నా, టిడిపి వాణిజ్య విభాగం అద్య క్షులు కోమటి బుజ్జి(లెజండ్ ),మండలపార్టి ప్రెసిడెంట్ బొండా సన్ని దేముడు, జాజుల చిన్నా, చుక్క సన్యాశిరావు, బొడ్డిపల్లి అప్పారా వు, పైల చిన అక్కు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన మంత్రి మోడీ పర్యటన నిరసిస్తూ

# ఒక్కరోజు రిలే నిరాహారదీక్ష



గాజువాక : ఆంధ్రప్రదేశ్‌కు విభజన చట్టంలో ఉన్న హామీలు ప్రత్యేక హెూదా, రైల్వేజోన్ వంటి ప్రధానమైన పోరు బీసంతుగా అమలు పరిచి విశాకలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పర్యటించాలని అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి ప్రసాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం పాతగాజుక ప్రధాన కూడలిలో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్రమైన అన్యాయం చేసిన ప్రధాన మంత్రి మోడీ పర్యటన నిరసిస్తూ గాజువాక నియోజకవర్గ శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు కార్యాలయం సిబ్బంది ఒక్క రోజు రిలే నిరాహారదీక్ష చేశారు. ముగింపు సమావేశానికి ప్రసాదుల శ్రీనివాస్ ముఖ్య అతిధిగా వచ్చి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ నాయకులు బీజేపీతో కుమ్మక్కై రాజకీయాలకు స్వస్తి చెప్పి రాష్ట్రానికి అన్యాయం చేసిన మోడీని నిలదీయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 50వ వార్డు ప్రెసిడెంట్ చట్టి గోపి, గోమాడ వాసు, బొండా జగన్, కోయిలాడ శంకర్, పల్లా చంటి, సన్నికరణం, సనపల సన్యాసిరావు, హరి తదితరులు పాల్గొన్నారు.

# లుఫిన్ పార్మాసేవలు అద్భుతం : బండారు

## - పరవాడలో పార్కు ప్రారంభం - వెన్నెలపాలెం మండపానికి కుర్చీలు అందజేత



పరవాడ: పరవాడ మండలము వెన్నెలపాలెం గ్రామంలో ఇటీవలే నిర్మించిన ఎసి కళ్యాణి మండపానికి లుఫిన్ పార్మా కంపెనీ వారు కుర్చిలును అందజేసారు. అనంతరము పరవాడలో లుఫిన్ ఫార్మ అర్దికసహయం (ముప్పై లక్షలు)తోపార్క్ ను నిర్మించారు. ఈ పార్క్ ను బుదవారము స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ముఖ్య అతిథిగా హజరై ఆయన చేతులు మీదగా ప్రారంభించారు. అనంతరము అయన మాట్లాడుతూ లుఫిన్ పార్మాసేవలును కొనియాడారు. ఈ కార్య క్రమంలో ఎంపిపి మాసవరపుఅప్పలనాయుడు, జడ్పిటిసి పైల జాగన్నాధ రావు, పెందుర్తి ఇన్‌ఛార్జి బండారు అప్పల నాయుడు, వెన్నెలపాలెం ఎంపిటిసి సభ్యులు పైలసన్యాశిరావు, పరవాడ మాజీసర్పంచ్ చుక్కరామునాయుడు, పరవాడఎంపిటిసి సభ్యులు సిరపురపుఅప్పలనాయుడు, మండలటిడిపిప్రదాన కార్యదర్శి పైలరామచంద్రరావు, జన్మభూమి కమిటి మెంబరు రెడ్డిశ్రీనువాసురావు, జిల్లాతెలుగు యువతఅర్గనైజింగ్ కార్యదర్శి వియ్యపు చిన్నా, ఇ.బోనంగిమాజీఉపసర్పంచ్ బుగిడిగోవింద, మాజీసర్పంచ్ అట్టాసన్యాశి అప్పారావు, చుక్కసన్యాశిరావు, పైల చినఅక్కు నాయుడు మరియు లుఫిన్ జిఎమ్ దేముడుబాబు, సియస్ అర్ ప్రతినిది అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# నేను సీఎం చంద్రబాబును నమ్ముకున్నాను : ఎమ్మెల్యే పంచకర్ల



అచ్యుతాపురం : నేను సీఎం చంద్రబాబును నమ్ముకున్నానని తనపై కొన్ని పత్రికలలో వచ్చిన వార్తలను నమ్మవద్దని యలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు .బుధవారం అచ్యుతాపురంలో పంచకర్ల క్యాంపు కార్యలయంలో ఎమ్మెల్సీ పప్పుల చలపతిరావు, మునిస్పల్ చైర్పర్సన్ రమా కుమారి లతో కలిసి నాలుగు మండలాల్లోని టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు .ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు ప్రకారం ఎక్కడ పోటి చేయమంటే అక్కడ నుంచే పోటి చేస్తానన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ రాజాన రమేష్ కుమార్ , వైస్ ఎంపీపీ ఉమ్మిడి కాసులమ్మ అప్పారావు ,జడ్పీటిసీ జనపరెడ్డి శ్రీనివాసరావు ,టిడిపి నాయకులు కూంద్రపు వెంకునాయుడు, మేరుగు బాపునాయుడు ,కూనిశెట్టి రమణ ,బైలపూడి రామదాసు ,ఉమ్మిడి జగన్ అదిక సంఖ్యలో నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.


## సబ్బవరం టీడీపీ మండల నాయకులు

# మోడీ గోబ్యాక్ అంటూ నిరసనలు



సబ్బవరం : సబ్బవరం టిడిపిమండల నాయకులు గోబ్యాక్ అంటూ నిరసనలు తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం మూడు రోడ్ల కూడలిలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు శిభిరం ఏర్పాటు చేసుకుని మోడీ గ్యోబాక్ అంటూ నినాదాలు చేసారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా పాల్గొన్న పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి విభజన హామీలు నెరవేర్చకుండా ఏ ముఖము పెట్టుకుని రాష్ట్రానికి వస్తున్నారని ఎదురు ప్రశ్న వేసారు. ప్రత్యేక హెూదా ఇవ్వలేదని, విశాఖకు రైల్వేజోన్ ఇవ్వలేదని ఆంధ్ర ప్రజలకు నమ్మక ద్రోహం చేసారని వారు ఆరోపించారు. మరలా ఎన్నికలు వస్తున్న తరుణంలో విశాఖకు వస్తున్నారని గత హామీలు నెరవేర్చకుండా మళ్లీ కళ్లబొల్లి మాటలు చెప్పడానికి వస్తున్నారా అని నిలదీసారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మిడతాడ మహలక్ష్మి నాయుడు, గండి దేముడు, గండి ముత్యాలనాయుడు, కొటాన అప్పారావు, శరగడం శంకర్రావు, కొత్తూరుగెడ్డప్ప, కరణం రాము నాయుడు, పోతల కనకరాజు, కె శ్రీను, గవర అప్పారావు, రేషిపూడి రమణ, మడ్డు సూర్య నారాయణ,పల్ల తాతారావు, అక్కబాబు, తదితరులు పాల్గొన్నారు.

# మార్చి1వ తేదీన చేపట్టే ప్రజా చైతన్య సభను విజయవంతం చేయండి




విశాఖపట్నం : బీచ్ రోడ్డులో ఉన్న కాళీమాత విగ్రహం దగ్గర నుండి ఆర్‌కె బీచ్ వద్ద ఉన్న సబ్ మెరైన్ వరకు భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా నగర అధ్యక్షురాలు లలిత ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మార్చి 1 వ తేదీన విశాఖపట్నంలో చేపట్టే ప్రజా చైతన్య సభ సందర్భంగా వెలకమ్ మోడీ జీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు తోట విజయలక్ష్మి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా తోట విజయ లక్ష్మి మాట్లాడుతూ మార్చి 1 వ తేదీన జరుగబోవు ప్రజా చైతన్య సభకు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొనా లని కోరుతూ బీచ్ రోడ్డులో ఉన్న కాళీమాత విగ్రహం దగ్గర నుండి ఆర్‌కె బీచ్ వద్ద ఉన్న సబ్ మెరైన్ వరకు ర్యాలీగా వెళ్లి ప్రజలందరికీ ఆహ్వానించడం జరిగింది. మార్చి 1 వ తేదీన జరుగబోవు ప్రజా చైతన్య సభకు విశాఖ నగరం నుంచి ఒక ఐదు 5 వేల మంది మహిళా కార్యకర్తలు హాజరు కానున్నట్టు మహిళా అధ్య క్షురాలు తెలియజేశారు.ఈ కార్య క్రమంలో రాష్ట్ర కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు , రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పావని, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి ప్రశాంతి, భాగ్య లక్ష్మి, మహిళా మోర్చా నగర ప్రధాన కార్యదర్శి మహాలక్ష్మి, దంతేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# భవిత కేంద్రానికి సీలింగ్ ప్యాన్, ట్యూబ్‌లైట్స్ బహుకరణ

రావికమతం : రావికమతం భవిత కేంద్రానికి చోడవరంకు చెందిన వ్యాపారి ఉప్పల సతీష్ రూ.5వేల విలువ చేసే సీలింగ్ ప్యాన్లు, నాలుగు ట్యూబ్‌లైట్లు, 30 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పలకలు అందజేశారు. మండల విద్యాశాఖాధికారి అప్పారావు చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. సర్వశిక్షా అభియాన్ ద్వారా 30 మంది విద్యార్థులకు మంజూరైన ఎస్కార్ట్ అలవెన్స్ రూ.63వేలు, ఏపి వికలాంగ సంక్షేమశాఖ మంజూరు చేసిన స్కాలర్‌షిప్ రూ.40వేలు కూడా వారి చేతుల మీదుగా అందించారు.

ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ దివ్యాంగుల సేవే దైవ సేవగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపిడిఒ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# మోడీ... గోబ్యాక్




అనకాపల్లి : విశాఖపట్నం విచ్చేయుచున్న నరేంద్రమోడీను గోబ్యాక్ అంటూ అనకాపల్లి ఎమ్మెల్యే పీలా గోవిందసత్య నారాయణ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు, స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లో నినాదాలు చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రకు ప్రత్యేక హెూదా ఇచ్చారనా, ప్రత్యేక రైల్వేజోన్ ఇచ్చారనా, దేనికి విశాఖకు విచ్చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు మళ్ల సురేంద్ర, పట్టణ అధ్యక్షులు డాక్టర్ నారాయణరావు, బి.ఎస్. ఎమ్.కె. జోగానాయుడు, బొలిశెట్టి శ్రీనువాసరావు, కొణతాల శ్రీను, మళ్ల శ్రీను, నంబారు శ్రీను, మహిళలు పాల్గొన్నారు.

# లాప్‌టాప్ గల విద్యార్థుల వివరాలు ఇవ్వండి

## జాయింట్ కలక్టరు ఎ.మల్లిఖార్జున



కాకినాడ : రానున్న సార్వత్రిక ఎన్నికలు, ఎమ్ఎల్ సి ఎన్నికలకు వెబ్ కాస్టింగ్ నిర్వహణకు లాప్ టాప్ కలిగిన ఇంజనీరింగ్ విద్యార్థుల వివరాలు సేకరించి అందజేయాలని జాయింట్ కలక్టరు ఎ.మల్లిఖార్జున వివిధ ఇంజనీరింగు కళాశాలల ప్రిన్సిపల్స్‌ను ఆదేశించారు. కాకినాడ కలక్ట్ రేట్ వివేకానంద మీకోసం ప్రజావాణి సమావేశపు హాలులో వివిధ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్స్‌తో పోలింగ్‌లో వెబ్ కాస్టింగ్‌కు లాప్టాప్ కలిగిన విద్యార్థుల వివరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలక్టరు ఎ.మల్లిఖార్జున మాట్లాడుతూ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థుల వద్ద లాప్ టాప్ ఉన్న వివరాలు, ఆ లాప్ టాప్‌కు కెమెరా ఉన్నది, లేనిదీ వివ రాలు తెలియజేయాలన్నారు. జిల్లాలో 4580 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని 19 నియోజక వర్గాలలో మొత్తం 5వేల లాప్ టాప్ లతో విద్యార్థులు అవసరమై ఉన్నదని, వారి సేవలను ఎన్నికల పోలింగ్, కౌంటింగ్‌లలో వినియోగించడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో నెట్ సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని, నెట్ లేని చోట అవసరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని జెసి తెలిపారు. ఆయా కళాశాలల్లో చదువుతూ లాప్ టాప్ గల విద్యార్థుల ఫోన్ నెంబర్లు, ఇ-మెయిల్ ఐడి వివరాలు ఇవ్వాలని ఆయన సూచించారు. విద్యార్థులను పోలింగ్ కేంద్రాలకు తీసుకొని వెళ్లటకు వాహనాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. వారికి డివిడిలు ఇవ్వడం జరుగుతుందని పోలింగ్ ప్రక్రియ రికార్డుంగు చేసి ఇవ్వాలని జెసి తెలిపారు. జిల్లా కలక్టరు మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎన్నికలకు అవసరమైన మెన్ అండ్ మాన్ ఫవర్ ను ఉపయోగించుకొనే అధికారం ఎన్నికల కమీషన్ నియమ, నిబంధన ప్రకారం ఉన్నందున అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు తమ సహాయ సహకా రాలు అందజేయాలని కోరారు. విద్యార్థులు వెబ్ కాస్టింగ్ నిర్వహించి నందుకుగాను వారికి ఎన్నికల కమీషన్ నిర్ణయించిన గౌరవ వేతనం ఇవ్వడం జరుగుతుందని జెసి మల్లిఖార్జున తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఎన్ టియు కె ప్రొఫెసర్ జెవిఆర్ మూర్తి, వివిధ ఇంజనీరింగ్ కళాశా లల ప్రిన్సిపల్స్, తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 4న రామనారాయణంలో శివరాత్రి మహెూత్సవం

విజయనగరం: ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో మార్చి 4వ తేదీన శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం 10 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు పరమశివునికి అభిషేకాలు, సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని ఎన్ సి ఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 4వ తేదీన జై దుర్గా నృత్య కళాక్షేత్రం, నర్తనశాల విద్యార్థులచే నృత్య ప్రదర్శన, సరిగమ సంగీత కళాశాల విద్యార్థులచే గానసుధ, జ్ఞానేశ్వర్ కల్యాణ్, ఇవటూరి నారాయణశర్మల ప్రవచనం ఉంటాయని అన్నారు. ఈ సమావేశంలో మూర్తి, ఉమా మహేశ్వరరావు, శ్రీనివాస రాజు, ఎం.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నియమనిబద్ధతకు కంట్రోల్ రూం ఏర్పాటు

## జిల్లా కలెక్టర్ కార్తి కేయ మిశ్రా

కాకినాడ : ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు జరి గేట్లు పర్యవేక్షించేందుకు కలెక్టర్ రేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ కార్తి కేయ మిశ్రా తెలియజేశారు.

బుధవారం ఉదయం కలెక్టరేట్ ప్రాంగణంలో ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ లో జిల్లా కలెక్టర్ కార్తి కేయ మిశ్రా తొలి మీడియా సమావేశాన్ని నిర్వహించి ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ తొలి రెండు రోజులు 25, 26 తేదీలలో నామినేషన్లు ఏమీ దాఖలు కాలేదని తెలియజేశారు. ఈ నెల 24వ తేదీ రాత్రి 7 గం.ల నుండి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు లోకి వచ్చిందని, కోడ్ అమలు పర్యవేక్షణకు రాజమండ్రి మున్సిపల్ కమీషనర్ సుమీత్ కుమార్ గాంధీ నోడల్ అధికారిగా యంసిసి టీములు ఏర్పాటు చేశామన్నారు. డిఎఫ్ ఓ టెరిటోరియల్ నందన సలారియా ఇన్ చార్జి అధికారిగా కలెక్టర్ ప్రాంగణంలోని వివేకానంద ప్రజావాణి హాలులో యంసిసి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, కోడ్ అమలు, ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీలు కంట్రోల్ రూమ్ నెంబర్లు 0884-2371950, 0884-2371951, టోల్ఫ్రీ నెం 1800-425-3077 లకు తెలియజేయాలని కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ట అమలు పర్యవేక్షణకు తూర్పు గోదావరి జిల్లాలో 74, పశ్చిమ గోదావరి జిల్లాలో 48 యం.సి.సి టీములను ఏర్పాటు చేస్తామన్నారు. ఓటర్లకు సమాచార సేవలు అందించేందుకు 1950 హెల్ప్ లైన్ పని చేస్తోందని, ఇప్పటి వరకూ ఈ కేంద్రం సేవలను 6,012 మంది ప్రజలు వినియోగించుకోవడం జరిగిందన్నారు. స్వీప్ కార్యక్రమాల క్రింద ఈవియంలు, వివిపాట్ యంత్రాల వినియోగంపై జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రజలకు అవగాహనా శిబిరాలు




నిర్వహిస్తున్నామని, ఇప్పటి వరకూ 1,372 గ్రామాలు, ఆవాసాల పరిధిలో గల 2067 పోలింగ్ కేంద్రాలలో నిర్వహించిన శిభిరాల ద్వారా లక్ష, 49 వేల 271 మందికి ఈ అవగాహన కల్పించామన్నారు. జిల్లాలో ఓటర్లలో కనీసం 10 శాతంగా సుమారు 4 లక్షల మంది ఓటర్లకు ఓటింగ్ యంత్రాల వినియోగం పై అవగాహన కల్పించాలని లక్ష్యం చేపట్టడం జరిగిందన్నారు. అలాగే డ్వాక్రా సంఘ సమావేశాలు, ఉపాధి హామీ పనుల ప్రదేశాలు, పింఛన్ పంపిణీ కేంద్రాల వద్ద కూడా ఈ శిభిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మీడియా ప్రతినిధులకు కూడా ఓటింగ్ యంత్రాల వినియోగంపై అన్ని నియోజక వర్గాల, మండలాల కేంద్రాలలో ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఆర్ఓలు, తహశిల్దారులను ఆదేశించామని జిల్లా కలెక్టర్ తెలిపారు. స్వీప్ కార్యక్రమాల ద్వారా 12 మున్సిపాలిటీల పరిధిలో 76 హోర్డింగ్లు ఏర్పాటు చేసి ఓటర్లు తెలుసుకోవలసిన సమాచారాన్ని ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ అంశాలపై మీడియాకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు కంప్యూటర్లు, ఇంటర్నెట్, ఫోన్లు, టివిలు తదితర సదుపాయాలతో కలెక్టరేట్ గ్రౌండ్ ఫ్లోర్ లో మీడియా ఫెసిలిటీ సెంటర్ ను ఏర్పాటు చేస్తామని, ప్రతి రోజూ సాయంత్రం 4 లేదా 5 గంటలకు తాను లేదా జాయింట్ కలెక్టర్ లేదా ఈ ఎన్నికల ఏఆర్ గా వ్యవహరిస్తున్న డిఆర్ ఓ వీడియూ సవవేశం నిర్వహించి తాజా సమచారం తెలియజేస్తామన్నారు.

రాజమండ్రి మున్సిపల్ కమీషనర్ సుమీత్ కుమార్ గాంధీ, డిఎఫ్ఓ నందన సలారియా, డిఆర్ఓ యం.వి.గోవిందరాజులు, మీడియా సెంటర్ ఇన్ చార్జి ఎస్ డిసి సుధారాణి, సమాచార శాఖ డిడి యం.ఫ్రాన్సిస్, ఏపియంఐపి పిడి రామ్మోహనరావు పాల్గొన్నారు.

# ప్రధాన సమస్యలపై పోరాడుతాం

- ఘనంగా అనిశెట్టి జన్మదిన వేడుకలు - 62లోకి అడుగుపెట్టిన అనిశెట్టి




పిఠాపురం : నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలపై పోరాడతామని పిఠాపురం నియోజకవర్గ జనసేన సమన్వయ కమిటీ సభ్యుడు, రిటైర్డ్ ఇంజనీరింగ్ చీఫ్ అనిశెట్టి వెంకట సుబ్బారావు అన్నారు. బుధవారం గొల్లప్రోలు జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన 62వ జన్మదిన వేడుకలు అభిమానులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ ఏర్పాటుచేశారు. మండలంలోని బి.ప్రత్తిపాడు, గొల్లప్రోలు, దుర్గాడ, వన్నెపూడి, తాటిపర్తి, భోగాపురం, పిఠాపురం నుంచేగాక ఇతర ప్రాంతాల నుంచి కూడా ఆయన శుభాకాంక్షలు తెలిపేందుకు అధిక సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు. 1958వ సంవత్సరంలో ఫిబ్రవరి 27న అనిశెట్టి సూర్యప్రకాశరావు, వెంకటరత్నం దంపతులకు జన్మించిన ఆయన చదువులోను, ఎదుటివారికి సహాయం చేయడంలోనూ ముందుండేవారని ఆయన సన్నిహితులు తెలిపారు. ఉద్యోగంలో చేరిన తరువాత అనేక ఉన్నత పదవులు అధిరోహించి ఇంజనీరింగ్ చీఫ్‌గా ఆయన పదవి విరమణ పొందారు. పదవి విరమణ పొంది సంవత్సర కాలం కావస్తున్న ప్రజలకు ఇంకా ఏదో సేవచేయాలనే తపనతో రాజకీయంలోకి వచ్చానని తెలిపారు. ప్రజల కోసం పవన్‌కళ్యాణ్ తన సినిరంగ జీవితాన్ని విడిచి జనంకోసం పెట్టిన పార్టీ జనసేన పార్టీ అని, ఆయన సిద్ధాంతాలు నచ్చి పార్టీలో జాయిన్ అవ్వడం జరిగిందన్నారు. రాజకీయాల్లో మార్పు రావాలంటే పాలన మారాలని... పవన్ పాలన రావాలని ఆయన అన్నారు. ప్రజలకు సేవ చెయ్యాలనే సంకల్పంతో తాను జనసేన పార్టీలోకి చేరడం జరిగిందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో అనేక సమస్యలపై జనసేన పార్టీ తరపున పోరాడుతున్నామని, జనసేన పార్టీ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిత్వం ఖరారు చేస్తే నియోజకవర్గంలో వున్న ప్రధానసమస్యలైన యు.కొత్తపల్లిలో కె.ఎస్.ఈ.జెడ్, ఫిషింగ్ హార్బర్, మాధవపురం, కొండెవరం, గోర్స, సూరవరం గ్రామలకు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సిన పరిస్థితి ఎంతైనా వుందని, గొల్లప్రోలులోని సుద్దగడ్డ కాలువకు శాశ్వత పరిష్కారం చేసే విధంగా కృషి చేస్తానన్నారు. తన జన్మదిన వేడుకలు నిర్వహించి తన అభిమానులకు, జనసేన కార్యకర్తలకు ప్రత్యే కృతజ్ఞతలు తెలియజేశారు. జనసేన కాకినాడ పార్లమెంటరీ సభ్యుడు కర్నిడి శ్రీను, సమన్వయ కమిటీ సభ్యులు బాలిపల్లి రాంబాబు, సలాది బాబులు, తోలేటి శిరీష, వూటా నానిబాబు, చక్కపల్లి ధర్మరాజు, సిద్ధా నారాయణరావు, తలారి శ్రీను, మొగలి రాజా, కె.నాగమణి, ఎరుపల్లి దేవి, ఎరుపల్లి కుమారి, ఎరుపల్లి తాతారావు, ఎరుపల్లి లోవకుమారి తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో వున్నారు.

# ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

యలమంచిలి రూరల్ : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి గ్రామస్థులు సహకరించాలని సిఐ విజయ్‌నాథ్ కోరారు. యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని పెదపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి రానున్న ఎన్నికలు పురస్కరించుకొని గ్రామస్థులు అవగాహన సదస్సులు నిర్వహించారు. గ్రామంలో యువకులు, నాయకులు, కార్యకర్తలు వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్నికలకు విఘాతం కలిగించే పనులు చేస్తే కేసులు తప్పవన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించ కూడదన్నారు.

# అమలాపురం దేశం అధ్యర్థిగా "సాధనాల"



అమలాపురం : రానున్న అసంబ్లి ఎన్నికల్లో అమలాపురం నియోజకవర్గం నుండి తెలుగు దేశం పార్టి అభ్యర్థిగా సాదనాల శ్రీనివాస్ పేరును పార్టి అదిష్టానం పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది.అల్లవరం మండలం దేవగుప్తానికి చెందిన శ్రీనివాస్ 1984సం..నుండి తెలుగుదేశం పార్టిలో సాదారణకార్యకర్తగా చేరి అనంతరం గ్రామ టిడిపి పార్టి అధ్యక్షడుగా,మండల ప్రచార కార్యదర్శిగా వ్యవహరించారు.శ్రీనివాస్ న్యాయ వాధిగా మంచి పేరుతెచ్చుకున్నారు.కోస్టల్ రిసోర్సెస్ ఇంప్రోమెంట్ సర్విస్ ట్రస్టు ను స్థాపించి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పకృతి వైపరిత్యాలు సంభవించినపుడు పార్టి అదేశాలమేరకు ముందుండి నియోజక తీర ప్రాంతా బాదితులకు బియ్యం, దుప్పట్లు, వంటపామాగ్రి వంటి నిత్యావసర వస్తువులను పంపిణి కార్యక్రమాల్లో చురుకుగా ఉండేవారు.స్వర్గియ లోక్‌సభ స్పీకర్ జి.ఎమ్.సి బాలయోగి అనుచరునిగా పార్టి లోను,ప్రజలలోను పేరు సంపాదించుకున్నారు.బాలయోగి వర్ధంతి,తెలుగుదేశం పార్టి పోలిట్‌బ్యురో,సినీనటుడు నంద మూరి హరికృష్ణ జయంతి కార్యక్రమాలను క్రమంతప్పకుండా చేసేవారు. 2009-2014 ఎన్నికల్లో దేశం అభ్యర్థి గాపరిశీలనలో ఉన్నారు.అఎన్నికలల్లో శ్రీనుకు పార్టి నుంచి టికెట్ లభించక పోయినప్పటికి పార్టి ఆదేశాలను మేర పార్టి తరపు బరిలో ఉన్న వ్యక్తులకు విజయానికి కృషి చేసారు.జిల్లాలోఆర్ధికశాఖా మంత్రి యనమల రామకృష్టుడు, ఉపముఖ్య మంత్రి, హెూమ్ శాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఆశీసులు మెన్నుగా ఉన్నట్లు వినికిడి.సాదనాల శ్రీను పేరుతోపాటు, అమలాపురం పట్టణానికి చెందిన మాజీ ఎం.ఎల్.ఏ చిల్లా జగదీశ్వరి పురుషోత్తం, అమలాపురం రూరల్ మండలం సమనసకు చెందిన పరమట శ్యామ్ లపేరులతోపాటు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది.

# హైస్కూల్‌కు బీరువాను బహుకరించిన పూర్వ విద్యార్థులు



కాట్రేనికోన : కాట్రేనికోన మండలం లో 1996-97వ సంవత్సరం లో కాట్రేనికోన హై స్కూల్ లో పదవ తరగతి చదివిన పూర్వపు విద్యార్థులు బుధవారం కలుసుకున్నారు. అనంతరం వీరిఆధ్వర్యంలో హైస్కూలు కు బీరువాను బహుకరించారు. ఇంచార్జ్ హెచ్.ఎమ్. ఈశ్వరరావు గారికి పూర్వపు విద్యార్థుల లో కొంతమంది బీరువాను అందించారు.

ఈ కార్యక్రమంలో చింతా రాంబాబు,హర్ష, జె.శ్రీనివాస్, షరీఫ్, మాకే దానియేలు రాజు,గిడ్ల శేషగిరి,కుడుపూడి శివ ప్రకాష్, దోనిపాటు నాగేశ్వరరావు,మమత, సుభాషిణి, లక్ష్మీ,రమాదేవి, ఆకోండి సాయి కిరణ్ , తదితరులు పాల్గొన్నారు.

# దళితతేజం పేరుతో టిడిపి మోసం చేస్తోంది

## భాజా పాజిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సూర్యారావు

కాకినాడః దళిత తేజం పేరుతో తెలుగు దేశం ప్రభుత్వం దళితులను మోసం చేస్తుందని విమర్శించారు. స్థానిక శాంతినివాస్ హోటల్‌లో ఆయన పాత్రికేయ సమావేశంలో మాట్లాడుతూ సాక్షాత్తూ ముఖ్యమంత్రి ,మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు అనేక మార్లు దళితుల పట్ల అవమానకరంగా మాట్లాడి దళితుల ఆత్మగౌరవంను కించ పరస్తూ రాష్ట్రంలో అనేక చోట్ల దళితులపై దాడులు చేసారన్నారు. దళితుల అభివృద్ధికి ఖర్చు చేయాల్సిన సబ్ ప్లాన్ నిధులను దారి మళ్ళించి వారి అభివృద్ధి ,సంక్షేమం నీరుగార్చిందన్నారు. దళితుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన తెలుగుదేశం నేతలను పార్టీ నుండి బహిష్కరించకుండా వారిని కాపాడుతూ దళితుల పట్ల కక్ష సాధింపు ధోరణితో వ్యవవహరిస్తుందని విమర్శించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి ఇతర నేతలు దళిత తేజం కార్యక్రమం నిర్వహించడం దారుణమన్నారు. ప్రభుత్వ అధికారులు నిబంధనలు మరచి కొమ్ము కాయడం దారుణమన్నారు. మార్చి 1న విశాఖలో ప్రధాని మోధీ సభ విజయవంతం చేయడానికి దళితులు ఎదురుచూస్తున్నారన్నారు. దళిత సంక్షేమం అభివృద్ధికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ మోర్చా నాయకులు మత్తి జయప్రకాష్, కాకినాడ నగర మోర్చా అధ్యక్షుడు అయినవెల్లి సుధీర్ బాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ మోర్చా మీడియా కో-ఆర్డినేటర్ రొక్కాల సత్తిబాబు,



రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు పైడిమళ్ళ చెరియన్, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు డోకు బుర్ర శ్రీను, వివిధ మండల ఎస్సీ మోర్చా అధ్యక్షులు స్వామి కిరణ్, అయినవెల్లి రామారావు, జిల్లా ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తు నాగరాజు, జిల్లా కార్యదర్శి జి.వీర ప్రతాప్, ఎస్సీ మోర్చా నాయకులు ఏడిద కృష్ణ, ఎన్‌వి.శ్రీనివాస్, ఎస్టీ మోర్చా సభ్యులు త్రినాధ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఖేలో ఇండియా

## యాప్ లాంచ్ చేసిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ ఖేలో ఇండియా యాప్‌ను లాంచ్ చేశారు. యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ లో భాగంగా స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా రూపొందించిన ఖేలో ఇండియా యాప్‌ను ప్రధాని ఆవిష్కరించారు. యువతకు క్రీడల ఆవశ్యకత, ఫిట్‌నెస్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ యాప్‌ను రూపొందించారు.

రానున్న రోజుల్లో భారత్ క్రీడల్లో మరింతగా అభివృద్ధి చెంది.. అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ఈ యాప్ దోహద పడనుంది. దేశవ్యాప్తంగా టాలెంట్ ఉన్న క్రీడాకారులను గుర్తించేందుకు ఈ యాప్ ఉపయోగ పడనుంది. ఈ యాప్‌లో 3 ఫీచర్లు అందుబాటులో ఉన్నాయి.

18 రకాల క్రీడలకు సంబంధించి నియమనిబంధనలు, దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో క్రీడలపట్ల ఆసక్తి ఉన్న వ్యక్తుల డాటా సేకరణ, వివిధ క్రీడల కోసం ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలు, క్రీడాకారులకు ఫిట్‌నెస్ గురించి అవగాహన కల్పించడం మూడు ఫీచర్లలో అందుబాటులో ఉన్నాయి.


కేంద్ర మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్‌తోపాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హిందీ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఈ యాప్ అందుబాటులో ఉండనుంది.

# జగన్ ధ్యాసంతా ప్యాలెస్‌లపైనే

## ప్రజాసేవ పట్ల చిత్తశుద్ధి లేదు

## ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి : వైకాపా పేదల పార్టీ కాదని.. ప్యాలెస్‌ల పార్టీ అంటూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. హైదరాబాద్ వీడి జగన్మోహన్ రెడ్డి రాలేదని.. ప్యాలెస్ ఉంటే తప్ప ఇక్కడ నివసించలేరని దుయ్యబట్టారు. ఎక్కడికి వెళ్లినా రాజ ప్రసాదాల్లోనే జగన్ బస చేస్తారని విమర్శించారు. లోటస్ పాండ్, బెంగళూరు ప్యాలెస్, పులివెందుల ప్యాలెస్‌లకు తోడు ఇప్పుడు అమరావతిలో ఇంకో ప్యాలెస్ ఏర్పడిందన్నారు. జగన్ ధ్యాసంతా ప్యాలెస్‌లపైనే ఉందని.. ప్రజాసేవ పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ప్రజాప్రతినిధులు, బూత్ కన్వీనర్లు, పార్టీ బాధ్యులతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

రాజధాని విషయంలో వైకాపా ప్రజల్లో అనుమానాలు సృష్టిస్తోందని మండిపడ్డారు. అందరికీ అందుబాటులో రాష్ట్రం నడిబొడ్డున ఉన్న అమరావతిపై ప్రజల్లో అపోహలు పెంచుతారా? అని ప్రశ్నించారు. ఇప్పుడు వైకాపా తన మేనిఫెస్టోలో రాజధాని ఎక్కడ అనే అంశం పెట్టి తన దుర్బుద్ధిని బయటపెట్టిందని మండిపడ్డారు. విశాఖలో మోది సభకు వైకాపా జనాన్ని తరలిస్తోందని.. గుంటూరు సభకు కూడా జనాన్ని తరలించిందని చెప్పారు.

# కలుషిత వాతావరణంతోనే కంటి సమస్యలు



ఉచిత వైద్య శిబిరంలో బాధితులకు మందులు పంపిణీ చేస్తున్న శ్రీభరత్

విశాఖ సిటీః ఎమ్.పి.ఎమ్. ట్రస్టు మరియు ఎన్‌టిఆర్ సేవా సమితి ట్రస్టుతో కలసి నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని 39వ వార్డు మాదవదారలో ఉచిత వైద్య శిబిరాన్ని గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ ప్రారంభించారు. ఈ వైద్య శిభిరాల ద్వారా ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునే వీలు కలుగుతుందని, సకాలంలో వైద్యం పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

కలుషిత వాతావరణం కారణంగా కంటి సమస్యలతో పాటు వివిధ రకాల రోగాలతో సతమతమవుతున్న స్థానికులుకు ఉచితంగా వైద్య సేవలు పొందాలన్నారు. అందరికి మెరుగైన వైద్యమే లక్ష్యంగా గీతం అసుపత్రి ఆద్యరంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిభిరాన్ని శ్రీభరత్ సందర్శంచి, స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ శిభిరంలో మూత్రపిండాల సమస్యలు, స్త్రీల సమస్యలు, క్షయ, మోకాళ్ళలో ఆరుగుదల, గుండె జబ్బులకు, పరీక్షలు జరిపారు.మాదవదారలో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిభిరం ద్వారా స్థానికలలో అధిక శాతం కంటి సమస్యలు, వినికిడి, మోకాళ్ళు నోప్పి సమస్యలతో బాధ పడుతున్నాట్లు వైద్యలు గుర్తించారు.

గీతం దంత వైద్య కళాశాల ఆసుపత్రి, జిమ్‌సర్ ఆసుపత్రి వైద్య నిపుణులు, పెద్ద ఎత్తున సిబ్బంది వైద్య శిబిరాలలో పాల్గొన్నారు. కాగా బుదవారం 220 మందికి దంత పరీక్షలు, 250 మందికి కంటి వైద్య పరీక్షలు, 230 మంరికి స్త్రీ సంబంధిత పరీక్షలు, 220 మందికి సాధారణ పరీక్షలు నిర్వహించినట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో తెలుగు దేశం నాయుకులు సనపల పాండు రంగారావు, జివిఎంసి హైస్కూలు పూర్వ విద్యార్థుల చైర్మన్ సపల బంగారు రాజు, మరియు ట్రస్ట్ నిర్వాహకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# గీతం అడ్మిషన్ల సమాచారం

## గీతం స్కూల్ ఆఫ్ గాంధియన్ స్టడీస్ ద్వారా ఆంగ్ల భాషా, సాహిత్యాలపై ఎమ్.ఎ. ఇంగ్లీష్ పీజీ కోర్సు

సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్‌లో 10 బి.టెక్ కోర్సులకు, ఇసిఇ మరియు మెకానికల్ ఇంజనీరింగ్‌లో 6 సంవత్సరాల డ్యూయల్ డిగ్రీ కోర్సులు (బి.టెక్+ ఎమ్.టెక్, ఎమ్ఆర్క్ ఎమ్.టెక్ కోర్సులకు, బి.ఫార్మశి, ఎమ్.ఫార్మశి కోర్సులకు, ఐదేళ్ల బి.ఆర్క్ కోర్సుకు గ్యాట్-2019 ప్రవేశ పరీక్షను అఖిల భారత స్థాయిలో దేశంలోని 50 పట్టణాలలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నారు. పూర్తి చేసిన ధరఖాస్తులను 2019 వ సంవత్సరం మార్చి 30వ తేది లోగా అందజేయవలసి ఉంటుంది. ఏప్రియల్ 5వ తేది నుంచి గీతం వెబ్‌సైట్ www.gitam.eduలో హాల్ టికెట్ట్‌లను డౌన్ లోడ్ చేసుకోవచ్చు..

గీతం స్కూల్ ఆఫ్ గాంధియన్ స్టడీస్ ద్వారా ఆంగ్ల భాషా, సాహిత్యాలపై ఎమ్.ఎ. ఇంగ్లీష్ పీజీ కోర్సును నిర్వహిస్తున్నారు. ఎమ్.ఎ.ఇంగ్లీష్ కోర్సుతో పాటు ప్రొఫెషనల్ ఇంగ్లీష్ కమ్యూనికేషన్ మరియు సాఫ్ట్ స్కిల్స్ ప్రోగ్రామ్, విదేశీ భాషలలో సైతం సర్టిఫికేట్ కోర్సులను స్కూల్ ఆఫ్ గాంధియన్ స్టడీస్ ద్వారా నిర్వహిసున్నారు.

ఈ కోర్సులలో ప్రవేశం పొందడానికి ఆసక్తిగల విద్యార్థులు గీతం విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ గాంధియన్ స్టడీస్‌ను సంప్రదించవచ్చు. అదనపు సమాచారం కోసం అడ్మిషన్ల డైరక్టర్‌ను 9705748318, 7207361878 నంబర్లలలో సంప్రదించవచ్చు.

గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ద్వారా నిర్వహిస్తున్న ఎంబిఎ లో ఫైనాన్స్, మార్కెటింగ్, హెచ్ఆర్, ఆపరేషన్స్ & సిస్టమ్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లకు ప్రాక్టీస్ స్కూల్‌గా ఎంబిఎ (హెచ్ఆర్) కోర్సుకు అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారికి బ్యాచులర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బిబిఎ), బ్యాచులర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (మేనేజ్‌మెంట్ అకౌంటింగ్), బ్యాచులర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బిజినెస్ అనలటిక్స్) కోర్సులకు ఐదేళ్ల ఎంబిఎ కోర్సుకు (ఇంటిగ్రేటెడ్), బికామ్ (ఆనర్స్) కోర్సుకు 2019 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. ఆసక్తి గల విద్యార్థులు గీతం వెబ్‌సైట్ www.gitam.edu/gim ద్వారా దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

గీతం స్కూల్ ఆఫ్ లా ద్వారా ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఐదేళ్ల బిబిఎ, ఎల్ఎల్‌బి మరియు బిఎ, ఎల్ఎల్‌బి కోర్సులలో 2019 సంవత్సరానికి ప్రవేశాలు కల్పిస్తున్నారు. అలాగే డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు మూడేళ్ల ఎల్ఎల్‌బి కోర్సులో ప్రవేశాలు నిర్వహిస్తున్నారు. జాతీయ స్థాయిలో జరిగే కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్-2019) లో ర్యాంకు ఆధారంగా ఈ ప్రవేశాలు ఉంటాయి.

గీతం స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ (జిఎస్ఐబి) నిర్వహిస్తున్న ఎమ్‌బిఎ ఇంటర్నేషనల్ బిజినెస్, ఎమ్‌బిఎ ఇంటర్నేషనల్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్, ఎమ్‌బిఎ గ్లోబల్ లాగిస్టిక్స్ అండ్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమా ఇన్ బిజినెస్ అనలటిక్స్ కోర్సులలో ప్రవేశానికి గాను జిఎస్ఐబి ఎంట్రన్స్ టెస్ట్ (జెట్) నిర్వహిస్తున్నారు. దీనికి ఆన్‌లైన్‌లో www.gsib.org ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

# టీమిండియా నాకౌట్‌లో ఎదురైతే పరిస్థితేంటి

కరాచీ : ఓవైపు పుల్వామా ఉగ్రదాడి.. మరోవైపు పాక్‌పై సర్జికల్ స్ట్రైక్స్-2తో భారత్ ప్రతీకార దాడితో ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది.

దీంతో వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా భారత్-పాక్ మధ్య జరుగనున్న మ్యాచ్‌ల పట్ల సందగ్దం నెలకొంది.












VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com

